

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

కామారెడ్డి టౌన్, జూలై 17: జిల్లా గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉత్తమ ప్రతిభకనబరిచిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను డీఎస్పీ శ్రీనివాసులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా ఎక్కువ మార్కులు సంపాదించి ప్రయోజకులై తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఇటీవల ఉన్నత పదవిని పొందిన జిల్లా మత్స్యసహకారం సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, అయ్యప్ప సేవాసమితి ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



రుణమాఫీ అర్హుల.. లెక్క తేలింది!

- మొదటి విడత రైతుల వివరాలు ప్రకటించిన వ్యవసాయశాఖ
- జిల్లాలో 49,541 మంది లబ్ధిదారులు
- మండలాల వారీగా రైతుల వివరాలు ప్రకటన
- రూ. లక్షలోపు ఉన్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బుల జమ
- నేడు బ్యాంకర్లతో సమావేశం కానున్న కలెక్టర్
- రుణమాఫీ అనంతరం రైతువేదికల్లో సంబరాలకు ఏర్పాట్లు
- మూడు విడతల్లో రుణమాఫీ చేయనున్న ప్రభుత్వం
- మొదటి ప్రాధాన్యత పీఎం కిసాన్ లబ్ధిదారులకేనా?

కామారెడ్డి, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం చేపట్టిన కసరత్తు చివరి దశకు చేరుకుంది. జిల్లాల వారీగా రుణం పొందిన రైతుల వివరాలతో కూడిన తుది నివేదికలను ప్రకటించింది. మొదటి విడతలో అర్హత కలిగిన రైతుల జాబితాను బుధవారం విడుదల చేసింది. జిల్లాలో మొదటి విడతలో 49,541 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా గుర్తించారు. వీరందరికీ నేటి నుంచి రుణమాఫీ నగదును ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. ఇందుకోసం జిల్లాలోని ఆయా బ్యాంకర్లతో కలెక్టర్, వ్యవసాయ శాఖాధికారులు సమావేశం కానున్నారు. అయితే ప్రభుత్వం ఆగష్టు 15 వరకు మూడు విడతల్లో రైతు రుణమాఫీ చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. మొదటి విడత కింద నేడు సాయంత్రం నిధులను విడుదల చేయనున్నారు.

మొదటి విడతలో 49,541 మంది అర్హులు

గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించగా సీఎం రేవంత్‌రెడ్డి హామీని నెరవేర్చనున్నారు. నేటి నుంచి రుణమాఫీ నిధులను లబ్ధిదారుల రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. లబ్ధిదారుల రైతుల వివరాలను జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 22 మండలాల వారీగా రుణమాఫీకి అర్హులైన రైతుల వివరాల జాబితాను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 49,541 మంది రైతులు పంట రుణాల మాఫీకి లబ్ధిదారులుగా గుర్తించారు. అయితే పిట్లం మండలంలో అత్యధికంగా 3,736 మంది లబ్ధిదారులు ఉండగా, అత్యల్పంగా దోమకొండ మండలంలో 933 మంది ఉన్నారు. బాన్సువాడ మండలంలో 2,519 లబ్ధిదారులు ఉండగా, భిక్కనూర్‌లో 2,485, బీబీపేట 1,689, బిచ్కుంద 2,396, బీర్కూర్‌లో 1,983, గాంధారిలో 2,196, జుక్కల్‌లో 1,901, కామారెడ్డి 2,216, లింగంపేట 2,264, మాచారెడ్డి 2,094, మద్నూర్ 3,699, నాగిరెడ్డిపేట 3,482, నస్రూల్లాబాద్ 1,496, నిజాంసాగర్ 2,724, పెద్దకొడప్‌గల్ 1,011, రాజంపేట 2,211, రామారెడ్డి 1,490, సదాశివనగర్ 2,104, తాడ్వాయి 2,038, ఎల్లారెడ్డి 2,873 రైతులను అర్హులుగా గుర్తించారు.

రూ.495 కోట్ల రుణమాఫీ

2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు 5 ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల వరకు రుణాన్ని మూడు విడతల్లో మాఫీ కానుంది. అయితే మొదటి విడత కింద ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేయనున్నందున అర్హులైన రైతుల వివరాలను విడుదల చేసింది. జిల్లాలో 49,541 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా ఉన్నారని జిల్లా వ్యవసాయశాఖ వివరాలను వెల్లడించింది. వీరందరికీ మొదటి విడతలో రూ.లక్ష చొప్పున రుణం మాఫీకానుంది. ఈ లెక్కన రూ.495 కోట్ల రుణమాఫీ నిధులను ప్రభుత్వం ఆయా రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ప్రాథమిక సహకార సంఘాలు, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార కేంద్ర తదితర బ్యాంకుల పరిధిలో రైతులు రుణాలు తీసుకున్నారు. ఈ బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులం దరికీ రుణమాఫీ కానుంది.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకేనా?

రూ.2లక్షల రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతులకు తీపి కబురు అందించిన ప్రభుత్వం పలు నిబంధనలు పెడుతున్నట్లు తెలుస్తోంది. రుణమాఫీ కోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రతీ బ్యాంకుల్లో నోడల్ అధికారులను నియమించిన సర్కార్ పక్కా సమాచారం సేకరిస్తోంది. రేషన్‌కార్డు ప్రామాణికంగా రుణమాఫీ చేస్తామని, కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా కుటుంబంలో ఒకరికి మాత్రమే పెట్టుబడి సాయం అందిస్తున్న క్రమంలో మొదటి దఫాలో రుణమాఫీ కూడా ఈ రైతులకు ఇవ్వాలనేది ప్రభుత్వం ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం పట్టాపాసుబుక్ ఉండి రుణాలను తీసుకున్న వారందరికీ మాఫీ అవు తుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ వరకు రుణం తీసుకున్న ప్రతీరైతుకు వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు బ్యాంకర్లతో సమావేశం

రైతు రుణమాఫీని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేవంత్ ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చేందుకు నేటి నుంచి శ్రీకారం చుట్టనుంది. రూ.2లక్షల వరకు రుణమాఫీని మూడు విడతల్లో ప్రభుత్వం చేయనుంది. రూ. లక్ష లోపు తీసుకున్న వారికి గురువారం రైతుల ఖాతాలో మాఫీ డబ్బులను జమ చేయనుంది. ఈనెల చివరికల్లా రెండో విడత కింద రూ.1లక్షా 50వేల రుణాలను మాఫీ చేయనుంది. ఆగస్టు 15 వరకు రూ.2లక్షలు తీసుకున్న వారికి మాఫీ కానున్నాయి. ఇప్పటికే మొదటి విడత అర్హుల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. గురువారం సాయంత్రం నుంచి అర్హులైన రైతుల ఖాతాలో రుణం మాఫీ డబ్బులను జమ చేయనుందన ఉదయం జిల్లాలోని బ్యాంకర్లతో కలెక్టర్ వ్యవసాయశాఖ అధికారులు సమావేశం కానున్నారు. బ్యాంకర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా రుణమాఫీ నిధులను ఇతర వాటికి డైవర్ట్ చేయకుండా రైతుల ఖాతాలో జమచేసేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేయనున్నారు. సాయంత్రం రుణమాఫీ అయిన లబ్ధిదారులతో రైతు వేదికల్లో సంబరాలు జరిపేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

కస్తూర్బా విద్యాలయంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడేనా?

- 12.90 లక్షల నిధులు మంజూరు
- ఈ నిధులతో ఏ మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తారో?
- ముందుకు రాని మహిళా సంఘాల సభ్యులు
- ఇది నిజాంసాగర్‌లోని కస్తూర్బా పాఠశాల, కళాశాల దుస్థితి




కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇదే..

నిజాంసాగర్, జూలై 17: నిజాంసాగర్ మండల కేంద్రంలో కస్తూర్బా విద్యాలయంలో విద్యాభ్యాసం చేసే బాలికలకు మౌలిక సదుపాయాలు కనుమరుగయ్యాయి. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా కస్తూర్బా విద్యాలయానికి 12లక్షల 90వేలు కేటాయించారు. ఈ నిధులతో కస్తూర్బాలో విద్యాభ్యాసం చేసే పాఠశాల, కళాశాల విద్యార్థులకు కనీస వసతులు మెరుగు పడేనా అని విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. 1999లో కస్తూర్బా విద్యాలయం నెలకొల్పారు. అప్పట్లో 300 మంది విద్యార్థినులకు అంతంత మాత్రంగానే మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంటర్మీడియట్ మూడేళ్ల నుంచి కొనసాగుతోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులు 400 మంది విద్యాభ్యాసం చేస్తుంటారు. 3 ఏళ్ల క్రితం కోటి 50 లక్షలతో భవనం నిర్మాణం చేపట్టారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ, బాత్‌రూంలు, టాయిలెట్లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అరకొర వసతులతో ఈ కళాశాలలో దాదాపు 100 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కళాశాల విద్యార్థినులు స్నానపు గదులు, టాయిలెట్లు, మరుగుదొడ్లను కస్తూర్బా విద్యాలయంలో వినియోగించుకుంటున్నారు. గత మూడేళ్ల క్రితం టాయిలెట్లు, మరుగుదొడ్లు, వాటర్ సంపు నిర్మాణం చేపట్టినా సంబంధిత కాంట్రాక్టర్ అసంపూర్తిగా నిర్మాణం చేపట్టి వదిలివేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. డార్మెట్రీ, తరగతి గదుల కొరత తీవ్రంగా ఉంది. ఈ విద్యాలయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పాపాన పోవడం లేదని సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కళాశాల భవనాన్ని కస్తూర్బా విద్యాలయ అధికారులకు ఇప్పటికీ అప్పగించలేకపోయారు. తరగతి గదుల కారణంగా విద్యాలయ ప్రత్యేకాధికారి ప్రారంభించని కళాశాలలోనే తరగతులు నిర్వహించడం గమనార్హం. ఈ పాఠశాల, కళాశాల విద్యాలయంలో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయాల్సిన అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. తరచుగా విద్యుత్ సమస్య, టాయిలెట్ సమస్యలతో పాటు తదితర సమస్యలు కొట్టు మిట్టాడుతున్నా బాగుపర్చే నాథుడే లేడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిరుపేద బాలికలకు కస్తూర్బా అందుబాటులో ఉండటమే కాకుండా బడి మానేసిన విద్యార్థులకు కూడా విద్యాభ్యాసం చేయిస్తుంటారు. ఈ విద్యాలయ ప్రహరీతో పాటు వంట గది నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో వంట చేయడానికి పాట్లు పడుతునే ఉంటారు. ప్రహరీ లేకపోవడంతో పందులు పాఠశాల ఆవరణలో స్వైర విహారం చేస్తూనే ఉంటాయి. మండల కేంద్రానికి ఆమడ దూరంలో ఉన్న ఈ పాఠశాలకు కోతుల బెడద ఉండటంతో ఆదమరిస్తే దాడి చేస్తాయని విద్యార్థినులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రూ.12లక్షల 90వేలను అత్యవసర పనులకు వినియోగించేలా చూసి, కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పుస్తకాల మోత

- పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల బరువు
- ప్రైవేట్ పాఠశాలలో మరీ ఎక్కువ
- మోయలేక ఇబ్బందులు
- ప్రభుత్వ ఆదేశాలు భేఖాతారు



కామారెడ్డి టౌన్, జూలై 17: పాఠశాలల్లో పుస్తకాల మోతతో బాలల శారీరక ఎదుగుదల కుంటుపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ సొంత సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌తో విద్యార్థులకు మోయలేని భారాన్ని ఎత్తుతున్నారు. దీంతో కిలోల కొద్ది ఉన్న బ్యాగుల బరువు మోయలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలకు తోడు టిఫిన్‌బాక్స్, వాటర్ బాటిల్, బూట్లు తదితర వస్తువులు మరింత భారంగా మారుతున్నాయి. పిల్లల బాధ చూడలేక చాలా మంది తల్లిదండ్రులు పాఠశాల వరకు బ్యాగులు మోసుకెళ్లి దిగబెట్టి రావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో అనేక ప్రైవేట్ పాఠశాలల్లో ఇదే తరహ పుస్తకాల మోత ఉన్న విద్యాశాఖాధికారులు అందుకు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతునే ఉన్నారు. పాఠశాలల్లో పుస్తకాల బరువుపై రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితమే మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పెడచెవిన పెడుతునే ఉన్నాయి.

సబ్జెక్టుకు నాలుగైదు నోట్ బుక్స్

పాఠశాల స్థాయిలో ఒక్కప్పుడు ఆరు సబ్జెక్టులకు ఆరు నోట్ బుక్స్‌తో పాటు ఒక రఫ్‌బుక్ ఉండేది. ప్రస్తుతం సబ్జెక్టుకు ఒక రఫ్‌బుక్‌తో పాటు గైడ్లు, డ్రాయింగ్, స్క్రాప్‌బుక్స్, రికార్డులు, డైరీలని స్కూల్ బ్యాగుల్లో కిలోల కొద్ది పుస్తకాలు మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 6 నుంచి 12 కిలోల బరువైన బ్యాగులు, ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 నుంచి 17 కిలోల బ్యాగులను ప్రతిరోజూ వీపు మీద మోస్తున్నారు. రోజు ఇంతింత బరువులు మోయడం, ఒకటి, రెండు అంతస్తులు భవనాలు ఎక్కి క్లాస్‌రూం వరకు వెళ్లడం కారణంగా చాలా మంది పిల్లలు వెన్నునొప్పి, జాయింట్ పెయిన్స్ భారినపడుతున్నారు. ఇది విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదు.

ప్రభుత్వ మార్గదర్శకాలు ఇవీ..

చిన్నారులకు కిలోల కొద్ది బ్యాగుల మోతను తగ్గించేలా రాష్ట్ర విద్యాశాఖ 2020లో మార్గ దర్శకాలు జారీ చేసింది. ఒకటి, రెండో తరగతుల పుస్తకాల బరువు బ్యాగుతో సహ కిలోన్నర మాత్రమే ఉండాలి. ప్రస్తుతం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటి, రెండు తరగతుల పిల్లల బ్యాగులే సుమారు 4 నుంచి 8 కిలోల బరువు ఉంటున్నాయి. మూడు, నాలుగు తరగతులకు 3కిలోలు, ఆరు, ఏడు తరగతులకు 4 కిలోలు, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతులకు నాలుగున్నర నుంచి 5 కిలోల వరకు మాత్రమే బ్యాగు బరువు ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కానీ 10 నుంచి 15 కిలోల వరకు బరువును చిన్నారుల వీపుపై మోయిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల బాధలు చూడలేక పుస్తకాలను తగ్గించేందుకు ఒకటి రెండు ఇంటి వద్ద పెడితే పిల్లలకు ఫైన్‌లు, పనిష్మెంట్‌లతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. విద్యాశాఖ అధికారులైన అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఎక్కడ దృష్టి సారించిన దాఖలాలు లేవు.

అమలు చేయాల్సిందిలా..

ఆరు, ఏడు తరగతులకు మూడు లాంగ్వేజ్ బుక్స్‌తో పాటు మ్యాథ్స్, సైన్స్ సోషల్ సహ మొత్తం ఆరు పుస్తకాలే ఉండాలి. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతులకు ఆరు పుస్తకాలతో పాటు బయోసైన్స్ కలిపి ఏడు పాఠ్యపుస్తకాలు ఉండాలి. ప్రతీ సబ్జెక్టుకు 200 పేజీల నోట్ బుక్ మాత్రమే ఉపయోగించాలి. వాటిని ఎఫ్‌ఏలకు, స్లిప్ టెస్టులకు వినియోగించాలి. ఇవి కూడా రోజు తీసుకురావాల్సిన అవసరం లేదు. పాఠ్యాంశాల చివరన ఉన్న ఎక్సర్‌సైజ్‌లను ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాలల్లోనే పూర్తి చేయాలి. ఇందుకోసం ప్రత్యేక పీరియడ్లను కేటాయించాలి. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు హోంవర్క్ కోసం ఒక్కో సబ్జెక్ట్‌కు ఒక్కో రోజు కేటాయించేలా ప్రణాళిక ఉండాలి. ఏ సబ్జెక్ట్‌కు ఏ రోజు అనేది ఉపాధ్యాయులు ఏయో పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ తెచ్చుకోవాలో టీచర్లు ముందుగానే చెప్పాలి. స్టేట్ సిలబస్‌ను అమలు చేసే అన్ని పాఠశాలలు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి నిర్ణయించిన పుస్తకాలనే వినియోగించాలి.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



బాన్సువాడలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డి, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి ఏకాదశి వేడుకలను బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నిద్ర లేచి ఇల్లు, వాకిలి శుభ్రం చేసుకొని ఇంట్లో పూజలు నిర్వహించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప వాస దీక్షలు చేపట్టారు. బీర్కూరులోని తెలంగాణ తిరుమల దేవస్థానం, బైరాపూర్ రుక్మిణి విఠలేశ్వరాలయాల్లో తెల్లవారుజామున ఐదు గంటలకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చి వేంకటేశ్వర స్వామి వారిని, అమ్మవార్లను, రుక్మిణి విఠలేశ్వరున్ని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలో భజనలు, కీర్తనలు కొనసాగాయి. బీబీపేటలో వేణుగోపాల స్వామి దేవాలయాన్ని పువ్వులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు సహస్రనామాలను పఠించారు. భిక్కనూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు తొలి ఏకాదశిని భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరుపు కున్నారు. బాన్సువాడలో ఉదయం నుంచి శ్రీ రుక్మిణీ విఠలేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సుదర్శన హోమం నిర్వహించారు. ఎల్లారెడ్డిలో విష్ణుమూర్తి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పండుగను మహిళలు, భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉపవాస దీక్షను ఆచరించి రుక్మిణి సమేత పాండురంగాన్ని దర్శించుకున్నారు.

నేడు బోధన్‌లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పర్యటన

బోధన్‌రూరల్, జూలై17 : ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గురువారం బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, రెంజల్, నవీపేట, సాలూర, బోధన్ మండలాల్లో పర్యటిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మందర్నా రవి తెలిపారు. బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల ధర్నా



నందిపేటలో ధర్నా చేస్తున్న గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ కార్మికులు

నందిపేట, జూలై17 : మండల కేంద్రంలోని ఐలమ్మ చౌరస్తా వద్ద అర్గుల్ రాజారాం గుత్పఎత్తిపోతల పథకం, అలీసాగర్ లిఫ్ట్ కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేశారు. ముందుగా సీఐటీయూ ఆధ్వర్యంలో నందిపేట కొత్త బస్టాండ్ నుంచి నంది విగ్రహం, అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఐలమ్మ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కుటుంబసభ్యులకు దూరంగా ఉంటూ, ప్రాణాలకు తెగించి, రాత్రి, పగలు పనిచేస్తే సంబంధిత లిఫ్ట్ కాంట్రాక్టర్లు జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఐదునెలల నుంచి జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబపోషణ భారమైందని తెలిపారు. జీతాలు చెల్లించాలని అడిగితే సంబందిత కాంట్రాక్టర్లు తమను బెదిరిస్తున్నారని కాంట్రాక్టు కార్మికులు చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ఐదునెలల జీతాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని బాధితులు హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథ కాల కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రతినిధులు మూడ్ సీతారాం, కార్తిక్, అజయ్, బుచ్చన్న, రవి, నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎస్.ఐ

రుద్రూరు, జూలై 17 : పచ్చదనం పెంచేలా ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని రుద్రూరు ఎస్ఐ అప్పారావు పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్ఐ అప్పారావు రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఒక్కరిపై ఉందని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. బుధవారం సాలూర మండలంలోని మందర్నా గ్రామంలో ప్రతి ఇంటికి చెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మందర్నారవి, మాజీ సర్పంచ్ రావుబా గంగాధర్, పోలీసు సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు బెలూన్స్ ఏర్పాటు

డిచ్‌పల్లి, జూలై 17 : మండలంలోని నడిపల్లి పంచాయతీ ఈవో కిషన్ రావు, సిబ్బంది మూకుమ్మడిగా పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీ, నడిపల్లి, డిచ్‌పల్లి స్టేషన్ ప్రాంతాల్లో వర్షాల నేపథ్యంలో డెంగీ దోమల భారిన ప్రజలు గురి కాకుండా మురికి కాల్వల్లో క్రిమి సంహారక మందులతో తయారు చేసిన బెలూన్స్‌ను దోమల నివారణకు మురుగు కాల్వల్లో వేశారు. ప్రజలు కూడా ట్యాంకుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో కిషన్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వినూత్న చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట్‌రూరల్‌జూలై17: మండలంలోని అబ్బాపూర్(ఎం) సమీపంలో ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తమ్మిడి ప్రవీణ్ (31) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. తన మేనకోడలు హరిణిని బైక్‌పై నిజామాబాద్ తీసుకెళ్తుండగా ధర్మారం మూలమలుపు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కాగా అతని మేడకోడలుకు స్వల్ప గాయాలు అయిన విషయం విదితమే. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ప్రవీణ్ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడున్నారు. మృతుడు రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన వాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నవీపేట, జూలై 17 : మండలంలోని అబ్బాపూర్ (బీ) తండాకు చెందిన నేనావత్ వినోద్ (27) అనే ఆటోడ్రైవర్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం రాత్రి గుర్తుతెలియని మందును సేవించగా బుధవారం ఉదయం చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. వినోద్ గతంలో ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లగా రెండు సంవత్సరాల క్రితం స్వదేశానికి వచ్చి ఆటో నడుపుకుంటూ ఉపాధి పొందేవాడని అన్నారు. వినోద్ ఉపాధి నిమిత్తం ఫైనాన్స్ ద్వారా ఆటోను కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ చెల్లించకపోవడంతో ఆరుమాసాల క్రితం అప్పు ఇచ్చిన ఫైనాన్స్ వారు ఆటోను తీసుకెళ్లారు. దీంతో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవాడు. మంగళవారం రాత్రి వినోద్ తన ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందును సేవించగా బుధవారం ఉదయం చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

మెండోర, జూలై 17 : మండల కేంద్రానికి చెందిన దమ్మడి పోసాని తన వ్యవసాయ పనులకు మధ్యాహ్నం వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్ళాడని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మడి పోసాని భర్త రాజన్నతో కలిసి మెండోర, సావెల్ గ్రామాల మధ్య ఉన్న తమ వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. రాజన్న ముందు నడుస్తున్నాడు. కొద్ది దూరం వెనుకలో పోసాని నడుచుకుంటూ వస్తుంది. బైక్‌పై వచ్చిన వ్యక్తి పోసాని వద్ద ఆగి పోచంపాడ్ ఎటువైపు వెళ్లాలి అని అడిగాడు, ఆమె దారి చెప్పేలోపూ క్షణాల్లో మెడలోంచి తులంన్నర బంగారు గొలుసు లాక్కెళ్ళాడని బాధితురాలు కన్నీరుమున్నీరు అయింది. మెడలో బంగారు గొలుసు లాక్కెళ్ళిన సమయానికి నాలుగు నిమిషాల వ్యవధిలో సావెల్, దోబీఘాట్ వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో పల్సర్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కనిపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్, జూలై17: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కింది తండా బస్టాండ్ వద్ద గుర్తుతెలియని సుమారు 75ఏళ్ళ యాచకురాలు మృతదేహం లభ్యమైనట్టు ఏఎస్సై గంగారాం తెలిపారు. మృతురాలు ముఖం గుర్తుపట్టకుండా ఉందని బుధవారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఏఎస్సై తెలిపారు.

మాంసం వ్యాపారిపై దాడి

బోధన్‌రూరల్, జూలై 17 : బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో మటన్ వ్యాపారి రాజేశ్వర్‌పై కొంతమంది వ్యక్తులు దాడి చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్‌ల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

యువకుడి అదృశ్యం

ఎడపల్లి, జూలై17 : మండల కేంద్రానికి చెందిన మొగిలిచెర్ల చిన్న సాయిలు అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 11వ తేదీన కూలీ పనికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిలు నేటి వరకు తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని అన్న మొగిలిచెర్ల పెద్దసాయిలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటిన విద్యార్థి



విద్యార్థి రూపేష్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నిజామాబాద్ అర్బన్, జూలై 17 : ఇటీవల నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2024 పోటీలలో నగరానికి చెందిన ది పాఠశాల స్కూల్ విద్యార్థి ఈగరూపేష్‌రెడ్డి సత్తా చాటాడు. పోటీలో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా ఖ్యాతిని పెంచాడు. నగరంలోని వినాయక్‌నగర్ ది పాఠశాల స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రూపేష్ తైక్వాండోలో జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడంపై పాఠశాల యాజమాన్యం విద్యార్థిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండలో కాంగ్రెస్ నాయకుల సమావేశం

భీమ్‌గల్ రూరల్, జూలై 17 : బాల్కొండ నియోజక వర్గంలోని ఎనిమిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా మండల కార్యవర్గ సభ్యులు బుధవారం భీమ్‌గల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరెస్వామి మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలోని ముగ్గురు సీనియర్ నాయకులైనటువంటి బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మానాలమోహన్ రెడ్డి, అన్వేష్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి తాహెర్ బీన్ హుందాన్‌లకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం చాలా సంతోషంగా వుందని అన్నారు. ఈనెల 19వ తేదీన సహస్ర ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించబడుతుందని, కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమర్ గౌడ్, ముత్యాల సునీల్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు



రుద్రూర్‌లో పాల్గొన్న భక్తులు



రుద్రూర్‌లో పూజలు..

పెర్కిట్, జూలై17: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వెంకటేశ్వరకాలనీలో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకదశి సందర్భంగా పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆనంద చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటగిరి : మండలంలో బుధవారం తొలి ఏకాదశిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏకాదశి ఉపవాస దీక్షలు విరమించేందుకు బుధవారం ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రుద్రూరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలోని శ్రీ పాండురంగ విఠలేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు రామశర్మ, నారాయణరావుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు.

ముప్కాల్ : అషాడమాసంలో వచ్చే తొలి ఏకాదశి ముప్కాల్, బాల్కొండ మండలాల్లో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిట కిటలాడాయి. భక్తులు ఉపవాస దీక్షలు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణం, సాలూర, బోధన్ మండలాల్లోని విఠలేశ్వరాలయాల్లో, పలు దేవాలయాల్లో వైకుంఠ తొలి ఏకాదశి పండుగను బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

డిచ్‌పల్లి : మండలంలోని ధర్మారం (బీ), డిచ్‌పల్లి, ఘన్‌పూర్, గ్రామాల్లో గల వేం కటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, నిర్వ హించారు. మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ ఆలయంలో తొలి ఏకాదశి పురష్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలునిర్వహించారు.

నవీపేట: యంచలోని చారిత్రక విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు జిల్లాలోని పలుప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. బుధవారం రాత్రి ఆలయంలో భజనలు, కీర్తనలు నిర్వహించారు. గురువారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే మండల కేంద్రంలోని దర్యాపూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు మొదలుపెట్టారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య అభిషేకం, యజ్ఞం, హోమాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు రామాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా శివాలయం, సాయిబాబా ఆలయం, రామాలయం, వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హిందు తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతకుంట, గోపూర్, తిమ్మాపూర్, చేనెంబర్ దుబ్బ గ్రామ భక్తులు పాల్గొన్నారు.

వెల్మల్‌లో దొంగల హల్‌చల్

- తాళం వేసిన ఇళ్ళకు కన్నం
- మూడు ఇళ్ళల్లో చోరీ
- సుమారు 20 తులాల బంగారం, రూ.11 లక్షల నగదు అపహరణ



చిందర వందరైన వస్తువులు

నందిపేట, జూలై 17 : జిల్లాలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్ళనే టార్గెట్ చేస్తున్నారు. ఒకేరోజు తాళం వేసిన మూడుఇళ్ళకు కన్నం వేశారు. పెద్దఎత్తున బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్ళారు. రెండిళ్ళలోనే సుమారు 20 తులాల బంగారం, 18 తులాల వెండి ఆభరణాలు, రూ.11 లక్షల నగదు అపహరించారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండలం వెల్మల్ గ్రామానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ తన భార్యతో కలిసి ఈ నెల 16న యాదాద్రికి యాత్రకు వెళ్ళారు. ఇళ్ళకు తాళం వేసి ఉండడంతో ఆ ఇంటినే గుర్తుతెలియని దొంగలు టార్గెట్ చేశారు. తాళం పగలగొట్టి ఇంట్లోని రూ.10 లక్షల నగదు, 9తులాల బంగారం ఎత్తుకెళ్ళారు. యాత్రకు వెళ్ళిన దంపతులు బుధవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇండ్లకు తాళం పగలకొట్టి, వస్తువులు చింద వందర ఉండడంతో బిత్తరపోయారు. అలాగే నగలు, నగదు లేకపోవడంతో లబోదిబోమన్నారు. ఇటీవలే బాధితుడు డాక్టర్ చంద్రశేఖర్‌కు పంట చిట్టీ రావడంతో రూ.10 లక్షల నగదు జమైంది. అలాగే అదేరోజు రాత్రి దొంగలు డీకంపల్లి రోడ్డులో ఉన్న బర్లపాటి ప్రవీణ్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంట్లో నుంచి సైతం 8 తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు ఎత్తుకెళ్ళారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమిస్తున్న ప్రవీణ్ తన భార్యతో నిజామాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. అదే దొంగలు మరో ఇంటిని గుళ్ళ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు వేలిముద్రలు దొరకకుండా కారం పొడిని చల్లినట్లు ఆనవాళ్ళు ఉన్నాయి. చంద్రశేఖర్ ఇంట్లో సీసీ కెమెరాలకు చిక్కకుండా దొంగలు మాస్కులు ధరించారు. ఈ విషయమై పోలీసులకు వివరణ కోరగా చంద్రశేఖర్ ఇంట్లో రూ.1.80లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, రూ.7.50లక్షల నగదు, బర్లపాటి ప్రవీణ్ ఇంట్లో రూ.1.69 లక్షల విలువైన ఆభరణాలు, నగదు చోరీకి గురైందని పేర్కొన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ జి.రాహుల్ హెగ్డే తెలిపారు.

బారికేడ్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

మోస్రా, జూలై 17 : మండలంలోని గోపూర్ గ్రామ శివారులో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు తెలిపినా పరిష్కారం లేకుండా పోయిందని గ్రామస్థులు, గ్రామ మాజీసర్పంచ్ నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై ప్రచురితమైన జూలై 07 ఆదివారం ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా.? అనే వార్తకు అధికారులు స్పందించి బారికేడ్లను ఏర్పాటు చేశారు. బారికేడ్లకు రంగులు అద్ది గ్రామం పేరు పోలీస్ శాఖ పేరు రాయించి రేడియంతో కూడిన స్టిక్కర్లు పెట్టి ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డితో పాటు గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

'ఓ భారతీయుడా' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



అంకాపూర్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 17 : ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో బుధవారం ఓ భారతీయుడా అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. భారత సురక్ష సమితి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రచురించిన ఎమర్జెన్సీ 1975-77 ఓ భారతీయుడా పుస్తకాన్ని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితి కాలంలో జైలుకు వెళ్ళిన పుప్పాల రాజేందర్, రవినాథ్‌లను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధి కార ప్రతినిధి కలిగోట గంగాధర్, రాజేందర్, శ్రీధర్, రఘునాథ్ పాల్గొన్నారు.

'చేపూర్ పాఠశాలకు నిధులు మంజూరు చేయిస్తా'



చేపూర్‌లో రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 17 : మండలంలోని చేపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. పాఠశాల శిథిలావస్థకు చేరిందని గ్రామస్థులు వివరించగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అంతకు ముందు శ్మశాన వాటికకు సంబంధించిన రోడ్డును పరిశీలించారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తామని, శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు. అనంతరం ఆర్మూర్‌లోని సిద్దులగుట్టలో ఆయన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీగ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్ మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సాపల్లి జీవన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్న, అయ్యప్ప శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



ఉప్లూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

కమ్మర్‌పల్లి, జూలై 17 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పర్వదినాన్ని బుధవారం మండలంలోని పలుగ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గత తొమ్మిది రోజుల క్రితం గ్రామాల్లోని ఆషీర్‌ఖానాలో రంగురంగుల దట్టీలతో అలంకరించిన పీరీలను ప్రతిష్టించి ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు, ఊరేగింపులో పీరీలకు నీల్లుపోస్తు మొక్కులు చెల్లించుకున్నారు.

బోధన్‌రూరల్ : త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం అని మైనారిటీ మత పెద్దలు అన్నారు. బోధన్‌లో కుల, మతాలకు అతీతంగా ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహర్రం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలలో ముస్లిం సోదరులు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో పీర్లను ఊరేగించారు.

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్ సూర్యవంశీ ఆరేకటికె సంఘం ఆధ్వర్యంలో బుధవారం పీర్ల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలను వీధులలో ఊరేగించి గద్దెల వద్ద పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ఖిల్లా డిచ్‌పల్లిలో పీరిలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

జక్రాన్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామంలో ప్రజలు మొహర్రం పండగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అర్గుల్, జక్రాన్‌పల్లి, లక్ష్మాపూర్, మునిపల్లి, బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ, కలిగోట్, చింతలూర్, పడకల్, కేశపల్లి, సికింద్రాపూర్ గ్రామాల్లో మొహర్రం పండగను ప్రజలు, మైనారిటీ సోదరులు ఘనంగా జరిపారు.

రుద్రూరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. పీరీలను వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ గ్రామాల్లో నృత్యాలు చేశారు. అనంతరం పీరీలకు నైవేద్యం సమర్పించారు.

నవీపేట్ : మండలంలోని యంచ, స్టేషన్ ఏరియాలలో బుధవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను ఊరేగించారు.

డిచ్‌పల్లి : ఖిల్లా డిచ్‌పల్లిలో చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా వేడుకల్లో పాల్గొన్నారు. పీరీల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

మోస్రా : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో మొహర్రం పండుగను భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

ఆర్మూర్‌టౌన్ , జూలై 17 : మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ న్యాయది నోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది గరడి ఆనంద్ చట్టాలు, న్యాయ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారా యణగౌడ్, నర్సింహారెడ్డి, జితేందర్, సుదీర్‌బాబు, వెంకట్రాంరెడ్డి, ద్యాగ ఉదయ్, పెంట జలందర్ పాల్గొన్నారు.

నా ఫిర్యాదుపై చార్జీషీట్ ఇవ్వండి : కౌన్సిలర్



మాట్లాడుతున్న కౌన్సిలర్

ఆర్మూర్‌టౌన్ , జూలై 17 : చార్జిషీట్ దాఖలు చేయాలని పలుమార్లు పోలీసులను కోరినప్పటికీ స్పందించడం లేదని కౌన్సిలర్ బదం రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సంవత్సరం గడుస్తుందని, గత సంవత్సరం నవంబర్‌లో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశామని ఇప్పటి వరకు చార్జిషీట్ వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తన పిటిషన్‌పై వెంటనే చార్జీషీట్ దాఖలు చేయా లని ఆయన కోరారు.

పండుగ సాయన్న జయంతి వేడుకలు

నవీపేట, జూలై 17 : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ముదిరాజ్ ముద్దుబిడ్డ పండుగ సాయన్న జయంతి వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక పెద్దమ్మతల్లి ఆలయం వద్ద పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుంకరి మహిపాల్, సందీప్, సాయి, గంగాధర్, సాయన్న, హన్మాండ్లు, విఠల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎడపల్లి మండల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పండగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లిరాజు, మండల ముదిరాజ్ నాయకులు సున్నపు ఒడ్డెన్న, జనార్ధన్, యాసాడ రాజ్ కుమార్, అంజనేయులు, శ్రీనివాస్, మనోజ్, కృష్ణ ఉన్నారు.

పదవీ విరమణ చేసిన ఎంపీపీకి వీడ్కోలు సన్మానం

నందిపేట, జూలై 17 : మండలంలోని వన్నెల్(కే) గ్రామంలో బుధవారం ఇటీవల పదవీ విరమణ చేసిన నందిపేట ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డికి వీడ్కోలు పలికారు. పంచాయతీ మాజీ పాలకవర్గంతో పాటు కార్యదర్శి సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ కులసంఘాల సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, సొసైటీ మాజీచైర్మన్లు మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డిని సన్మానించారు. విడివిడిగా పుష్ప గుచ్చాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి లలిత, మాజీ ఉపసర్పంచ్ కాటిపల్లి కృష్ణారెడ్డి, ఖుద్వాన్‌పూర్ సొసైటీ మాజీ చైర్మన్ లోకహన్మాండ్లు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

జక్రాన్‌పల్లి, జూలై 17 : మండలంలోని అర్గుల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి గత ఏడాది క్రితం మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు బుధవారం ఇతర విద్యార్థులు ఆర్థికసహాయం అందజేశారు. అర్గుల్‌కు చెందిన షాదుల్లా గత ఏడాది మృతిచెందగా ఆయన కుటుంబం దీనస్థితిలో ఉందని తెలుసుకొని పూర్వవిద్యార్థులు రూ.37 వేల 500 ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు చింత మహేష్, సంగం మహిపాల్, పెద్దిరాజు, ప్రవీన్‌కుమార్, బెల్దారి గంగాధర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

ముప్కాల్, జూలై 17 : బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన భూమ్మిర్ల పృథ్వీరాజ్ (19) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి దుర్మారణం చెందాడు. ఎస్సై యాసిర్‌అర్ఫత్ తెలిపిన వివరాల ప్రకారం... పృథ్వీరాజ్ బుధవారం మధ్యాహ్న సమయంలో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ట్రాక్టర్ కడిగేందుకు తీసుకువెళ్లాడన్నారు. అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో గ్రామశివారులోని నాగలింగేశ్వర ఆలయం వద్దకు రాగానే ట్రాక్టర్ బోల్తాపడిందని ఎస్.ఐ తెలిపారు. కాసేపటికి చిన్నన్న దేవిదాస్ సమాచారం ఇవ్వడంతో తండ్రి పురుషోత్తం వెళ్ళి చూడగా ట్రాక్టర్ కిందపడి తీవ్ర గాయాలతో మృతిచెందాడన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జూనియర్ లైన్‌మెన్‌పై దాడిని ఖండించిన ఉద్యోగులు

వేల్పూర్, జూలై 16 : మండలంలోని పోచంపల్లి గ్రామ జూనియర్ లైన్‌మన్ సందీప్ మాజీ ఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డి చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. బుధవారం వేల్పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.నరేందర్‌నాయక్ మాట్లాడుతూ పోచంపల్లి గ్రామంలో మంగళవారం డీలిఫ్ట్ ఆపరేట్ చేస్తున్న సమయంలో జూనియర్ లైన్‌మెన్ సందీప్‌పై మాజీఉపసర్పంచ్ దాడి చేయడం హేయమైన చర్య అని, గ్రామంలో ఓ సంఘ భవనానికి ఎలాంటి అనుమతులు లేకుండా డైరెక్టర్‌గా సర్వీస్ వైర్ పెట్టుకొని అక్రమంగా విద్యుత్ వాడుతుంటే ఆ సర్వీసుల్ని జూనియర్ లైన్‌మెంట్ చూపిస్తుండగా మాజీఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డి అనే వ్యక్తి అకారణంగా కోపంతో దూషిస్తూ జూనియర్ లైన్‌మన్ సందీప్ కాలర్ పట్టుకొని నెట్టేస్తూ దాడి చేశారన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మాజీ ఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డిపై కేసు నమోదు చేసి వెంటనే రిమాండ్‌కు పంపాలని ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి నరేందర్‌నాయక్ ఎస్సైను కోరారు. కార్యక్రమంలో వేల్పూర్ సెక్షన్ లీడర్ కె.రాజు, లైన్ ఇన్‌స్పెక్టార్ నర్సయ్య, లైన్‌మెన్‌లు నరేష్, సాయిలు, జోసఫ్ ఉన్నారు.

గుంతలమయంగా బెటాలియన్ సర్వీస్‌రోడ్డు

డిచ్‌పల్లి, జూలై 17: 44వ జాతీయ రహదారి తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ పక్కన గల సర్వీస్ రోడ్డు గత కొన్నేళ్లుగా గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడం లేదు. పోలీస్‌స్టేషన్ నుంచి ఘన్‌పూర్, ముల్లంగి, కులాస్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి వెళ్లే వాహనదారులు ఈ గుంతల మయంగా ఉన్న రోడ్డు నుంచే కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు ద్వార వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ల మరమ్మతు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తరుచూ ఇస్లాంపూర రైల్వే గేటు పడుతుండడంతో చాలా మంది వాహనచోదకులు గ్రామాలకు వెళ్తంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.



గుంతల మయంగా మారిన బెటాలియన్ సర్వీస్ రోడ్డు



బైరాపూర్ విఠలేశ్వర మందిరానికి పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

బైరాపూర్ విఠలేశ్వర మందిరానికి
పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

బాన్సువాడ, జూలై 17: మండలంలోని దేశాయిపేట్‌లో తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం విఠలేశ్వరున్ని భక్తులు, వర్కార్లు బీర్కూర్ మండలం బైరాపూర్‌లోని తెలంగాణ విఠలేశ్వర మందిరానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్రలో మాజీ సర్పంచ్ శ్రావణ్ దంపతులు, ఉప సర్పంచ్ అంజయ్య మహరాజ్, మాజీ వార్డు మెంబర్ రత్నాకర్, గుడిసె రాములు, పాపయ్య మహరాజు భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గొట్టిముక్కులలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

దోమకొండలో సెంట్రల్ టీం పర్యటన

దోమకొండ, జూలై 17: మండలంలోని గొట్టిముక్కుల, అంచనూర్, దోమకొండ గ్రామాల్లో బుధవారం కేంద్ర జలశక్తి అభియాన్ టీం సభ్యులు కరుణాకరన్ డిప్యూటీ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ పవర్, ఆతర్య శ్రీ క్రిష్ణా పవర్ సీనియర్ సైంటిస్ట్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు హైదరాబాద్ పర్యటించారు. గొట్టిముక్కుల గ్రామంలో ఫిష్ పాండ్, చెరువు నుంచి మట్టిని రైతులు ఉపాధిహామీ కూలీలచే తమ వ్యవసాయ పొలాలకు తరలించిన స్థలాన్ని పరిశీలించారు. అంచనూర్‌లో పామ్‌పాండ్ పనులు, దోమకొండలో హార్టికల్చర్ పంటలను పరిశీలించారు. అనంతరం గడి కోటను సందర్శించారు. కోటలోని పురాతన భవనాలు, వాటి కట్టడాలను, కోట చరిత్రను కోట మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, ఇరిగేషన్ డీఈ అర్చన, ఏఈ బాలక్రిష్ణ, ఎంపీవో తిరుపతిరెడ్డి, ఏపీవో రజని, టీఏలు రాజేశ్వర్, కార్యదర్శులు సౌజన్య, సుధాకర్, రాజశేఖర్, లింగం, ఎఫ్ఏలు కే. అంజాగౌడ్, లింగం, రత్నకర్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే పర్యటన

ఎల్లారెడ్డి, జూలై 17: నేడు ప్రభుత్వం రైతుల ఖాతాలో రుణమాఫీ డబ్బులు జమ చేస్తున్న సందర్భంగా మండలంలోని మీసన్‌పల్లి గ్రామంలో ఉన్న రైతువేదికలో సాయంత్రం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అంతకు ముందు మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం కార్యక్రమం, అనంతరం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని తెలిపారు.

'నేటి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ
ముట్టడిని విజయవంతం చేయాలి'

పెద్ద కొడప్‌గల్, జూలై 17: ఆశ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నిర్వహించే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ ఆశ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సురేష్‌గొండ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు నెలకు 18వేల వేతనం అందించాలని డిమాండ్‌తో పాటు ఇతర అంశాలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి ఉన్నందున జుక్కల్ నియోజక వర్గానికి చెందిన 8 మండలాల ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఒక వేళ ఈ సమస్య తొందరగా పరిష్కారం కాకపోతే దశల వారీగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉద్యమాలు ఉంటాయని సూచించారు.



భిక్కనూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

భిక్కనూరు, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లకు అభయహస్తం హామీలను వెంటనే అమలుపర్చాలని ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గజ్జెల భిక్షపతి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు నంద రమేష్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఈ బీసీ ఏలోకి మార్చాలని, రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్ రిపోర్టును సుప్రీంకోర్టుకు అందజేయాలన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, జిల్లా కేంద్రాల్లో ఈ నెల 15 నుంచి 20వరకు తహసీల్దార్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేయన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం నాయకులు బండి రాములు, రాజంపేట సత్యనారాయణ, ఉప్పరి రాములు, బత్తుల లక్ష్మీనర్సింలు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

పెద్ద కొడప్‌గల్, జూలై 17: జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావ్ సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో బుధవారం ఆయా పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జుక్కల్ మండల కేంద్రానికి చెందిన సహకార సంఘం అధ్యక్షుడు శివానంద్ పటేల్‌తో పాటు, హంగర్గ మాజీ ఎంపీటీసీ నాగనాథ్‌తో పాటు మరికొందరు పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే తోట కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా రైతుల అబివృద్ధి కోసం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తుందని, లక్ష రూపాయల లోపు రుణం ఉన్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమకానున్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు.

జిల్లాలో ఘనంగా మొహర్రం

భిక్కనూరు, జూలై 17: భిక్కనూరు మండల కేంద్రంతో పాటుగా మండలంలోని పెద్దమల్లారెడ్డి, జంగంపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం మొహర్రం పండుగను కులమతాలకు అతీతంగా మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఉదయం పీర్లను డప్పుచప్పుళ్ల నడుమ ముస్లింలు ఊరేగించగా ఆయా గ్రామాల ప్రజలు దర్శించుకుని దట్టీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కాగా మండలంలోని పెద్దమల్లారెడ్డితో పాటుగా ఆయా గ్రామాల్లో మొహర్రం సందర్భంగా పెద్దఎత్తున జాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టూ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరై అసైదులా ఆడారు. ఈ మేరకు ఎలాంటి సంఘటనలు జరగకుండా భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందూ, ముస్లింలు అనే తేడా లేకుండా మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకున్నారు. పీర్లను ఆ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. దట్టీలు, కూడక పేర్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్ని గుండాలు తొక్కి ఘనంగా వేడుకలను నిర్వహించారు.

పెద్ద కొడప్‌గల్: పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు, జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు కుల, మతాలకు అతీతంగా మొహర్రం వేడుకలను జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో గల ముస్లిం సోదరులు పెద్ద పీర్లను తయారు చేసి స్థానికంగా ఉండే మజీద్‌లలో ప్రతిష్ఠించారు. అనంతరం సాయంత్రం సమయంలో గ్రామాలలోని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. దీంతో ప్రజలు ఊరేగింపుగా వచ్చిన పీర్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బెల్లంను ప్రసాదంగా భావిస్తూ పీర్లకు సమర్పించారు. అనంతరం ఈ బెల్లాన్ని కార్యక్రమానికి హాజరైన భక్తులకు పంచి పెట్టారు. ఇక సాయంత్రం పీర్లను ఊరేగింపు చేసే సందర్భంగా అలయి బలయి ఆడుతూ, విచిత్ర వేషధారణలు ధరించి ప్రదర్శించారు. పీర్ల ఊరేగింపు అనంతరం పీర్లను స్థానికంగా ఉండే గ్రామాల చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. కుల మతాలకతీతంగా మొహర్రం పీర్ల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామాల్లో ఉన్న అషుర్ ఖనాలను అందంగా అలంకరించి పెద్ద పీర్లను ప్రతిష్ఠించి ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. గోధుమ పిండి, బెల్లంతో తయారు చేసిన మలిదను, కొబ్బరిని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అసైదుల హారతి అంటూ భక్తి పాటలతో పీర్లతో గ్రామ ప్రధాన వీధుల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు పీర్లను తీసుకెళ్లి నీళ్లు చల్లి నిమజ్జన కార్యక్రమంతో ముగించారు. జుక్కల్ మండలంలోని పెద్ద ఏడ్గి గ్రామంలో ప్రతిష్ఠించిన పీర్లను మంగళవారం రాత్రి జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహర్రం అని, ఈ పండుగను ప్రజలందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవడం సంతోషకరమైన విషయమని తెలిపారు. ప్రజలందరూ ఇలాగే కలిసిమెలిసి అన్ని రకాల పండుగలు జరుపుకోవాలని సూచించారు.



పెద్దమల్లారెడ్డిలో జాతర నిర్వహిస్తున్న దృశ్యం

ఆగస్టు 15 లోగా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జూలై 17: ఆగస్టు 15లోగా రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని పోచారం నియోజకవర్గంలో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతులను రుణ విముక్తి చేయడంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతలో లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు ఉన్న రైతులకు రేపు రుణమాఫీ మొత్తం బ్యాంకులో జమ చేస్తారన్నారు. లక్ష రపాయల లోపు ఉన్న రాష్ట్రంలోని మొత్తం 11.50 లక్షల మంది రైతులకు గురువారం రూ.6,800 కోట్లు రైతుల ఖాతాలలోకి జమ అవుతాయన్నారు. ఇంత భారీ మొత్తంలో రైతులకు రుణమాఫీ జరగడం గొప్ప విషయమని ఆయన తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో లక్ష రూపాయల వరకు ఉన్న 13,600 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతు రుణమాఫీని పురస్కరించుకుని ప్రతి ఏఈవో క్లస్టర్ పరిధిలోని లబ్ధి పొందిన రైతులతో రైతు వేదిక వద్ద సంబరాలు జరపాలని ఆయన సూచించారు. ఈ సంబురాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో బాన్సువాడ నియోజకవర్గం అద్భుతంగా అభివృద్ధి చెందినదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఈ అభివృద్ధి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏడీఏ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: నేడు ఉమ్మడి మండలాల వేదికలో లక్ష లోపు రుణాల మాఫీ కార్యక్రమం ఉంటుందని ఉమ్మడి మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా రుణమాఫీ లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారని అన్నారు. మద్నూర్, లింబూర్ రైతువేదిక ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొనాలన్నారు. కావున మద్నూర్ మండల రైతులు మద్నూర్ రైతు వేదికలో, డోంగ్లీ మండల రైతులు లింబూర్ రైతు వేదికలో తప్పనిసరిగా అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని రైతు వేదికలో నేడు రుణమాఫీపై సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీమ్ తెలిపారు. రైతులకు సంబంధించిన లక్ష రూపాయల లోపు రుణమాఫీకి సంబంధించిన నిధులు రైతుల ఖాతాలలో జమ కానున్నాయని తెలిపారు.

దోమకొండ: ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి మాట్లాడుతూ మేనిఫేస్టోలో పొందుపరిచిన విధంగా ఆగస్టు 15లోపు రూ.2లక్షలు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్, నల్లపు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, అబ్రబోయిన రాజు, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సిలిండర్ పేలడంతో పూర్తిగా ధ్వంసమైన రేకుల ఇల్లు

పెద్దమల్లారెడ్డిలో పేలిన గ్యాస్ సిలిండర్

● పూర్తిగా ధ్వంసమైన ఇల్లు

భిక్కనూరు, జూలై 17: ఉదయం మొఖం కడగగానే చాయ్ పెట్టుకుందామని గ్యాస్ ముట్టిస్తుండగా ఒక్కసారి గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటన భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితురాలు తుపాపతు సత్తెవ్వ తన ఇంట్లో ఉదయం చాయ్ పెట్టుకుందామని ప్రతిరోజూ లాగానే గ్యాస్ ముట్టించగానే గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో భయాందోళనకు గురైన సత్తెవ్వ అరుస్తూ బయటకు పరుగెత్తింది. ఈ సమయంతో బాధితురాలి వెంట్రులకు మంట తాకడంతో కొన్ని వెంట్రుకలు కాలగా కొద్దిసేపటికే సిలిండర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. పెద్ద శబ్దం రావడంతో ఆ నోట ఈ నోట ఈ విషయం గ్రామంలో వ్యాపించడంతో పెద్దఎత్తున గ్రామస్థులు అక్కడికి చేరుకుని సత్తెమ్మను ఓదార్చారు. కాగా కళ్ల ఎదుటే రేకుల ఇళ్లు పూర్తి ధ్వంసమైంది. గ్యాస్ సిలిండర్ సైతం చాలా దూరం ఎగిరి పడింది. ఈ ప్రమాదంలో సత్తెమ్మ ప్రతి నెల వచ్చిన పింఛన్ డబ్బులను ఒక కుండలో దాచిపెట్టుకోగా అవి పూర్తిగా కలిపోయాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది పంచానామా నిర్వహించాగా, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పరిస్థితి సమీక్షించారు.

ద్విచక్ర వాహనం, టాటాఎస్ ఢీ : ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి, జూలై 17: ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనంను ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే బుధవారం సాయంత్రం ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గ్రామ సరిహద్దు వద్ద కామారెడ్డి నుంచి బైక్‌పై ఎల్లారెడ్డికి వస్తున్న మహ్మద్ హాజీ (36) ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళుతున్న ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మహ్మద్ హాజీని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై మహేష్ బొజ్జ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, జూలై 17: మండలంలోని కాళోజీ వాడి గ్రామానికి చెందిన గడ్డం రామకృష్ణ(30) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామానికి చెందిన రామకృష్ణ బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లోని మల్కాజిగిరిలో ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యాడు. అప్పుల బాధలు తట్టుకోలేక స్వగ్రామానికి తిరిగి వచ్చి గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

బీర్కూర్, జూలై 17: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కంటం సుజాత అనే మహిళకు బుధవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ 21వేల చెక్కును అందజేశారు. అలాగే అబ్దుల్ అబ్రార్ ఖాన్ అనే వ్యక్తికి 13,500 రూపాయల విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికాంత్, సందీప్, ఆరీఫ్, రఘు తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌తో ఉపాధ్యాయుడి మృతి

ఎల్లారెడ్డి, జూలై 17: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శక్తిరాజ్ గత సంవత్సరం కాలం నుంచి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శక్తి రాజ్ బుధవారం మృతి చెందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబు తెలిపారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల స్థానికులు సంతాపం తెలిపారు.

విఠలేశ్వర ఆలయంలో రవీందర్‌రెడ్డి పూజలు

బీర్కూర్, జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి బుధవారం బైరాపూర్ విఠలేశ్వర ఆలయానికి విచ్చేశారు. స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూపులు

మద్నూర్, జూలై 17: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు మహాలక్ష్మీ పథకం కింద రూ.2,500 ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రజాపాలనలో భాగంగా లబ్ధిదారుల ఉంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ పెన్షన్లు కొత్తవి అమలు కావడం లేదని దరఖాస్తులు స్వీకరించినప్పటికీ పెన్షన్లు కొత్తవి అమలు కావడం లేదని దరఖాస్తు చేసుకున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, నూతన పెన్షన్‌ల కోసం కళ్లల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. మండల పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరిగి ఫలితం లభించడం లేదు. ఇక దివ్యాంగుల కోసం ప్రభుత్వం సదరం క్యాంపులు నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు అందజేసినప్పటికీ అధికారులు ప్రభుత్వం వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని చెబుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సదరం క్యాంపులకు హాజరై తెచ్చుకున్న సర్టిఫికెట్లు కూడా కొంత మందివి కాలం చెల్లిపోగా మళ్లీ క్యాంపులకు హాజరై సర్టిఫికెట్లు తెచ్చుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పెన్షన్ మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. మద్నూర్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 9982 పెన్షన్లు వస్తున్నాయి. వారిలో 3090 వృద్ధులు, 992 వికలాంగులు, వితంతువులు 2661, ఒంటరి మహిళలు 188, బీడీ కార్మికులు 35 మంది ప్రతీనెల పెన్షన్లు పొందుతున్నారు. కాగా ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పటి వరకు పెన్షన్లు రాకపోవడంపై ఆవేదన చెందుతున్నారు.

హైకోర్టు ప్లీడర్‌గా శ్రావణ్ కుమార్ గౌడ్

దోమకొండ, జూలై 17: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన పి. శ్రావణ్‌కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్లీడర్‌గా నియమించింది. ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా 19 మందిని ప్రభుత్వ అడ్వకేట్లుగా నియమించినట్లు శ్రావణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. వీరు హైకోర్టులో ప్రభుత్వ కేసులను వాదించనున్నారు. న్యాయశాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి పేరిట జీవో 399ని జారీ చేసిందని తెలిపారు. శ్రావణ్‌గౌడ్ 10వ తరగతి వరకు కామారెడ్డిలో చదివి పై చదువులు హైదరాబాద్‌లో అభ్యసించాడు. లా పూర్తి చేసి హైదరాబాద్‌లోని హైకోర్టులో న్యాయవాదిగా పనిచేసిన సమయంలో హైకోర్టు బార్ అసోసియేషన్ ట్రెజరర్‌గా పనిచేశారు. శ్రావణ్ కుమార్ గౌడ్ చేసిన సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ ప్లీడర్‌గా నియమించింది. శ్రావణ్ కుమార్‌గౌడ్‌ను హైకోర్టు ప్లీడర్‌గా నియమించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా

● ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ టౌన్, జూలై 17: సమాజ హితం కోరే బ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించిన సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆగ్రో చైర్మెన్ కాసులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డైనమిక్ ముఖ్యమంత్రి అని, ప్రజల కోసమే పని చేస్తున్నారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ముందుగా రైతు రుణమాఫీ చేస్తోందన్నారు. బ్రాహ్మణుల్లో కూడా రైతులు ఉన్నారని, వారికి కూడా రుణమాఫీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చంద్రకాంత్ రావు, కార్యదర్శి ఉమాకాంత్‌రావు, రాంచందర్‌రావు, పురుషోత్తంరావు, దామరంచ ప్రదీప్‌రావు తదితరులున్నారు.

మొక్కజొన్న పంటపై తెగుళ్లు

పెద్ద కొడప్‌గల్, జూలై 17: ఎన్నో ఆశలతో జుక్కల్ నియోజక వర్గంలోని ఆయా మండలాలకు రైతన్నలు ఖరీఫ్ సీజన్ కింద ఆరుతడి పంటలో భాగంగా వివిధ పంటలతో పాటు మొక్కజొన్న పంటను సాగు చేశారు. చిన్నపాటి వర్షాలు కురియడంతో నియోజకవర్గ వ్యాప్తంగా రైతన్నలు భారీగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఆడపాదడపా కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు మొక్కజొన్న పంట కళకళలాడుతుండటంతో రైతన్నలు సంతోషంలో మునిగిపోయారు. అయితే ఇంతలోనే రైతన్నల పాలిట మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు, మోగి పురుగు శాపంగా మారి పంటకు నష్టం చేయడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా పంట పండే దశలో పంటపై తెగుళ్లు వ్యాపించడంతో ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే అప్పుడే పంటకు తెగులు రావడంతో పరిస్థితి ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

జుక్కల్ నియోజక వర్గంలో వేలాది ఎకరాల్లో పంట సాగు

జుక్కల్ నియోజక వర్గంలో మొక్కజొన్న పంటను సుమారుగా 24 వేలకు పైగా ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పిట్లం మండలంలో 2100 ఎకరాలలో, బిచ్కుందలో 5500, మద్నూర్‌లో 8500, జుక్కల్‌లో 4500, పెద్ద కొడప్‌గల్‌లో 2500, నిజాంసాగర్‌లో 1500 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పంటను సాగు చేస్తున్న రైతులు పంటపై కత్తెర, మోగి పురుగు వ్యాపించడంతో ఆందోళన చెందుతున్నారు. రోజు రోజుకూ పంటపై తెగులు వ్యాపించి పంటను నాశనం చేస్తుండటంతో నివారణ చర్యలు చేపట్టే దిశగా రైతులు సమాయత్తం అవుతున్నారు.

మొక్కజొన్న పంటకు కత్తెర, మోగి పురుగు నివారణ చర్యలు

తొలి దశలో పురుగు నివారణకు క్లోరిపైరిపాస్ 20 శాతం ఇసి, 2.5 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువ ఉన్నప్పుడు ఇమామెక్టిన్ బెంజోయెట్ 5 శాతం ఎస్‌జి 80 గ్రాముల మందును 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 40-45 రోజుల దశలో స్పైనోసాడ్ 45 శాతం ఎస్‌సి 60 మి.లీ మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

క్షేత్రస్థాయిలో
బీజేపీ మరింత బలపడాల్సి ఉంది

● ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, జూలై 17: క్షేత్రస్థాయిలో బీజేపీ మరింత బలపడాల్సి ఉందని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ ఆధిక్యత ప్రదర్శించిందని అన్నారు. ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పని చేస్తే స్థానిక సంస్థల్లో బీజేపీదే విజయం అని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుని నుంచి జడ్పీ చైర్మన్ వరకు అన్ని బీజేపీ ఖాతాలో పడాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కాలంలో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి వల్లే మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కానీ 6 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. ఉద్యోగాలు, మహాలక్ష్మీ పథకాల అమలు, రైతు రుణమాఫీ, రైతుబంధు అమలు వంటి హామీల అమలుకు నిరుద్యోగులు, మహిళలు, రైతులు ఎదురు చూస్తున్నారని వారి పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే గంగారాం, బీజేపీ నాయకులు మురళీధర్‌గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, చిన్నరాజులు, పైలా కృష్ణారెడ్డి, రంజిత్‌మోహన్, రవీందర్, రాము, శ్రీనివాస్, విపుల్, భరత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- భారతీయుడు-2
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- భారతీయుడు-2

బాన్సువాడ

మహేశ్వరి	- కల్కి
వెంకటేశ్వర్	- మహారాజ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

